# గుడ్డు గొడవ

శ్రీ మాచిరాజు

PRINCIPAL
AYURVEDA COLLEGE
RAJAHMUNDRY

"టాం టాం" సంపాదక మహాశయులకు—

అప్పచ్చూర్.
7, మే.

మొన్న ప్రొద్దున్న మాగోడ గడియారంలో 7—30 కు—అంటే అసలు టైము 8—15 అన్నమాట—ఒక గుడ్డు గడియారం దగ్గర్నుంచి క్రిందబడ్డది. ముందు కాళ్ళు కొద్దిగా వణికినా తరువాత అతిసాహసంతో దగ్గరకు వెళ్ళాను. అది పగిలిపోలేదని తెలియజేయుటకు పరమానందభరితంగా ఉంది. కాని ఒకప్రక్క రూపాయంతచొట్ట పోయిందనటం విచారనీయం.

కొందరు ఇది గడియారం మీద గుడ్డుపెట్టిన పిచ్చుక దన్నారు. కాని గడియారందేమోనని నా అనుమానం. గడియారం మట్టుకు కులాసాగానే ఆడుతుంది. కాని చిన్నమార్పు కనపడుతున్నది: ఇంతకుమునుపు పన్నెండింటికి ఆరుగంటలు కొడుతుండేది. ఇప్పుడు అసలు మానేసింది అంతే. తదితర పాఠకులకు కూడా ఇలాంటి అనుభవాలు ఉండియుండకపోవు.

అబ్బాయి పంతులు.

౨

యెడిటర్ మణీ, ఘృణీ,

భలే భలే,
12, మే,

పోయినసారి మీ పత్రికలో గుడ్డు ఉత్తరం చూస్తే నాకు చిన్నప్పటి స్మృతులు కొన్ని జ్ఞాపకం వస్తున్నవి. ఈ గుడ్డుకూ నాకూ విద్యార్థిదశలో •అవినా భావసంబంధం. ఎప్పుడు ఏపేపరిచ్చినా ఇది సిద్ధించకపోతే వొట్టు. నేను నవపేళలంగా స్కూలు ఫైనలు తప్పటానికి ఇది చేతికొద్దీ సహాయం చేసిందని నాసంపూర్ణ

అస్తు

[illegible]

రాంపిల్లి (క్యాంపు)
20, మే.

Dear Editor

గుడ్డుగురించి మీ పత్రికలో ఉత్తరాలు ప్రకటించటం ఆంధ్ర దేశానికి ఘోరమైన మహోపకారం.

అంతా గుడ్డుమయం. బ్రహ్మాండమే బ్రహ్మగారు స్వంతంగా పెట్టినగుడ్డు. అంతదాకా యెందుకు మన ప్రపంచమే గుడ్డురూపంలో ఉన్నది. అదీగాక అది సూర్యునిచుట్టూ తిరగటంలోకూడా ఈ రూపాన్నే ప్రదర్శిస్తుంది. "గుడ్డే ప్రపంచం ప్రపంచమే గుడ్డు" అన్నది నేస్వానుభవంమీద కనిపెట్టి ప్రపంచానికి చాటుతున్న ఒక వినూత్న తీర్మానం.

అంగారకరావు. M. A. Ph. D.

౪

రావణకోడేరు.

సంపాదకులకు

25, మే.

సత్పురుషులు, వందనీయులు, కేవలం మా గురువులు అయిన అంగారకగ్రహం M. A. Ph. D. గారు గుడ్డుగురించి వ్రాసింది గాడిదగుడ్డల్లె ఉంది.

పాపం అబ్బాయి పంతులుగారి గుడ్డు గడియారం మీంచి పడి చొట్టబోయిందంటే ఎవరూ విచారించరేం. దాన్నిగురించి నాకు తట్టిన అభిప్రాయాలు యివి:

గడియారం మీదనుంచి పడ్డచో ఏగుడ్డైయిననూసరే పగిలియుండవల్సింది. కాని పగులలేదు కనుక అది రబ్బరువంటి కవచంతో నిర్మింపబడి యుండియుండును. ఇటువంటి కవచముగల గుడ్డు ఆఫ్రికాదేశపు ఐదుకాళ్ళజంతువులది. అందుచే ఇది ఆఫ్రికా దేశపు ఐదుకాళ్ళజంతువు గుడ్డు

లేక అది గడియారపుదే అయినచో క్రిందనుంచి భద్రముగా జారియుండును.

అటులైనచో దాన్ని కోడిగ్రుడ్లల్లోపెట్టి పొదిగించుట యుచితము. అట్లు వీలుగానిచో West end watch వారిచేత పొదిగించుట శ్రేష్టము.

రావుజీ.

ఆర్నిథాలజిస్టు.

(Ornithologist)

౫

నిరక్షరపురం

2, జూన్.

సంపాదక

స్వామికి.

మీ పత్రికలో ఉత్తరాలు మా సెక్రెటరీ చదవగా విన్నాను. రావుజీగారి ఉత్తరం గుడ్డొచ్చి పిల్ల నెక్కిరించినట్లుంది.

అది గడియారపు గుడ్డోకాదో తెలిసికొనుటకు ఒకకిటుకు గలదు: గడియారము ఏముక్కకాముక్క ఊడదీసి చూచినచో లోపల మరికొన్ని గ్రుడ్లుండును. అట్లుచేయమని "అబ్బాయి పంతులు"గారితోనా తగూ.

రావుసాహెబ్ విఘ్నేశ్వరులు

విశాని.

౬

యెడిటర్ శేఖరా,

మొన్న మీ పత్రికలో రావుసాహెబ్ విఘ్నేశ్వరులు విశాని గారు యిచ్చిన అభిప్రాయం చిత్రమైంది. అలాచేస్తే 'జాతూ బంగారపుగుడ్డు' సామెతకు వస్తుందని అబ్బాయి పంతులుగారితోనా మనవి. రావుజీగారన్న ప్రకారం గుడ్డుతోగూడా గడియారాన్ని వెస్టు End వాచ్ కంపెనీకి పంపించుట యుచితము.

ఒక శ్రేయోభిలాషి.

8, జూన్.

౭

ఏమండోయ్ గాంధిపార్కు

యెడిటర్ గారూ, గం. 4—30.

మేం మొన్న క్లాక్ టవర్ గుడ్డు నొకదాన్ని చూసాం. దాన్ని గురించి ఏం విచారించకుండానే మేం 'టీ'తో పుచ్చుకొన్నాము. అది ఎంతో బాగుంది. క్లాక్ టవర్ గుడ్డే మేం పంపించకపోతే ఒక క్షుద్రగడియారపుగుడ్డు వెస్టుఎండ్ వాచి కంపెనీకి పంపించడం శోచనీయం. కనుక దానిని మాకు పంపించినచో సద్వినియోగము చేయగలవారమని యిందుమూలకముగా తెలియజేయడమైనది.

జకరయ్య.

పోలీసు ఇన్స్పెక్టరు.

౮

"టాం టాం" సంపాదక అప్పచ్చూర్,

మహాశయులకు 25, జూన్.

మీరు ఇకమీదట నాగుడ్డు గురించి వచ్చే ఉత్తరాలు ఆపటం శ్రేయస్కరం. అసలది గడియారపు గుడ్డూకాదు, పిచ్చిక గుడ్డూ కాదు. మా అబ్బాయి గడియారంమీద పడేసిన పింగ్‌పాంగ్ సెల్యూలాయిడ్ బంతి.

అబ్బాయి పంతులు.

